క్లుప్తంగా

కూలీల హాజరు పెంచండి



వెంకటాపురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

శిరివెళ్ల: మండలంలో ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరు పెంచాలని పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం వెంకటాపురంలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. పనుల నాణ్యత, వసతులు, కూలిపై ఆరా తీశారు. మండలంలో రోజుకు 4,456 మంది కూలీలు పనులకు వస్తున్నారని ఏపీఓ రామసుబ్బయ్య చెప్పారు. వ్యవసాయ పనులు లేనందున ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని పీడీ ఆదేశించారు. సర్పంచు ప్రసాదరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శివలింగం పాల్గొన్నారు.

కార్డుదారులకు నాణ్యమైన జొన్నలు



జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి ప్రభాకర్

నంద్యాల(రూరల్): మండలంలోని రేషన్ కార్డుదారులకు నాణ్యమైన జొన్నలు అందించాలని ఎంపీపీ శెట్టిప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాయమాల్పురం గ్రామంలో కార్డుదారులకు అందిస్తున్న జొన్నలను ఎంపీపీ అకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో బియ్యంతో పాటు జొన్నలు అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతానికి బియ్యం, బేడలు, చక్కెర, జొన్నలు ఇస్తున్నారని, త్వరలో రాగులు కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పూలశీను, బాషా, వీఆర్‌ఓ నవీన్‌రెడ్డి, పీఎస్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి



విద్యుత్ సబ్‌స్టేషన్ బ్రేకర్లను పరిశీలిస్తున్న ఏఈ రామసుబ్రహ్మణ్యం

దొర్నిపాడు.మండలంలోని గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్ బకాయిలు రూ.6.14 కోట్లు ఉన్నాయని, వెంటనే చెల్లించాలని ఆ శాఖ ఏఈ రామసుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. అధికారులు మొండి బకాయిలు చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. ఎస్సీ,ఎస్టీలు 200 యూ నిట్ల లోపు మాత్రమే విద్యుత్‌ను వినియోగించుకోవాలని అంతకు మించి ఒక్క యూనిట్ అధికంగా వాడినా మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం ఆయన సబ్ స్టేషన్‌లోని బ్రేకర్లు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లైనమెన్ నాగన్న, ఆపరేటర్ పుల్లయ్య ఉన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన శానిటేషన్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. స్థానిక ఆసుపత్రి ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి విధుల్లోకి తీసుకోవాలని ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తూ రూ.7500 వేతనం తీసుకుంటున్న శానిటేషన్ కార్మికులకు రూ.12,400 జీతం, అలవెన్స్ రూ.వెయ్యి చెల్లించటానికి ఏజెన్సీ అంగీకరించడంపై హర్షం వ్యక్తం చేశారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చవద్దంటూ ఈనెల 14వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి గిరిజన మేధావుల సదస్సుకు తరలివచ్చి విజయవంతం చేయాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మంగళవారం కోరారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే వెనుకబడిన గిరిజనులు చితికి పోతారని, ఉద్యమాల ద్వారా మన హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం సమాఖ్య నాయకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఉషారాణి, బద్దూనాయక్, మత్యనాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నంద్యాల(రూరల్): పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు తమ నెలవారి విద్యుత్ బిల్లులతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని ఏడీఈ ఆంథోనిరాజ్ మంగళవారం తెలిపారు. ఏడీఈ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించని వినియోగదారులకు ఈనెల 15వ తేదీలోపు సరఫరా నిలిపి వేస్తామని స్పష్టం చేశారు.

రబీ వరి కోతలు పూర్తయిన పొలాల నుంచి రైతులు, పశుపోషకులు వరి గడ్డిని కొనుగోలు చేసి తరలిస్తున్నారు. అయితే ఎకరా వర గడ్డి ధర రూ.2వేలు పలుకుతోంది. పొలంలో గడ్డిని ట్రాక్టర్‌కు వేయడానికి, సొంతూరుకు రవాణా, అక్కడ వాముగా వేయడానికి కలిపి రూ.10వేలు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు..



పొలంలో కట్టలు కట్టి ఉంచిన వరి గడ్డి

వరి గడ్డికి భలే డిమాండ్

- ఎకరా వరి గడ్డి ధర రూ.2వేలు
- తరలింపు ఖర్చులే అధికం
- కూలీల కొరతతో అవస్థలు
- ఇంటికి చేరేందుకు రూ.10వేలు ఖర్చు
- పోషకులకు భారంగా మారిన వైనం



వరిగడ్డిని ట్రాక్టర్‌కు వేస్తున్న కూలీలు

గోస్పాడు: వరి కోతల అనంతరం వరి గడ్డిని పశువులకు మేతగా వినియోగిస్తారు. ఈ సీజన్‌లో సాగు చేసిన గడ్డిని ఖరీఫ్ కోతలు పూర్తయ్యే వరకు పశువులకు వినియోగిస్తారు. డిసెంబర్ వరకు మళ్లీ వరి గడ్డి దొరకదని పశుపోషకులు, రైతులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక రైతులు ఎకరా వరిగడ్డికి రూ.2వేలు వసూలు చేస్తున్నారు. గడ్డి ధర తక్కువగా ఉన్నా..ఆ తరువాత వచ్చే ఖర్చులు తడిసిమోపెడవుతుండటంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఖర్చులకు భయపడి కొందరు పశువులను విక్రయిస్తున్నారు.

ఎకరా గడ్డి రూ.2వేలు

ఎకరా వరిగడ్డి రూ.2వేల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన వరిగడ్డిని కూలీలతో ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లకు వేసేందుకు రూ.2500 నుంచి రూ.3వేల వరకు చెల్లించాలి. ఆ గడ్డిని ట్రాక్టర్‌లో తరలించేందుకు మరో రూ.2500 వెచ్చించాలి. చివరగా తరలించిన గడ్డిని కల్లంలో వాముగా వేసేందుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు కూలీల ఇవ్వాల్సి వస్తుంది. మొత్తంగా ఎకరా గడ్డికి రూ.10వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

గతంలో కుప్పలు.. నేడు చుట్టలుగా..

గతంలో వరిగడ్డిని కోత అనంతరం కుప్పలుగా అలాగే తరలించేవారు. ఇందుకు కూలీలు ఎక్కువ అవసరమయ్యే వారు. అయితే కూలీలు ఈ పనికి ఎక్కువ మొత్తంలో డిమాండ్ చేస్తుండటం, వరి కోత పనులు ఎక్కువగా ఉండటం, వర్షాలు కురుస్తుండటంతో పనులకు రావడం లేదు. దీంతో కుప్పలకు బదులుగా యంత్రాలతో చుట్టలుగా చుట్టిస్తున్నారు. గతంలో ఎకరా వరి గడ్డి చుట్టగా చుడితే ఇంత మొత్తం అని యంత్రాల నిర్వాహకులు వసూలు చేసేవారు. ప్రస్తుతం వరి గడ్డిని ఒక చుట్టగా చుట్టేందుకు రూ.17 ప్రకారం చెల్లించాలి. పొలం యజమాని నుంచి రైతుల, పశుపోషకులు చుట్ట రూ.50 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఈ చుట్టలను ట్రాక్టర్‌లో వేసేందుకు కూలీలకు రూ.3వేలు ఇవ్వాల్సి వస్తుంది. అక్కడి నుంచి సొంత ప్రాంతానికి తరలించడానికి ట్రాక్టర్‌కు, వెంట ఇద్దరు కూలీలకు దాదాపు రూ.3వేలకు పైగా ఖర్చవుతుంది. ఆ చుట్టలను తమ ప్రాంతంలో వాముగా వేసి నిల్వ చేసుకుంటారు.

వరిగడ్డి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం



పశువులకు అవసరమైన వరిగడ్డిని తెచ్చుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అయితే సీజన్ కావడంతో పశువుల మేత ఏడాదికి ఒకసారి మాత్రమే సేకరించుకొని నిల్వ చేసుకుంటాం. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి వరిగడ్డి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నాం. అయితే గడ్డిని తరలించేందుకు అధికంగా ఖర్చవుతుంది. –శ్రీనివాసులు, జోళదరాశి

ఎకరా గడ్డికి రూ.10వేలు అవుతోంది



పశుపోషణ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం.మేత కోసం సేకరించే వరిగడ్డికి ఎకరాకు రూ.10వేలు దాకా ఖర్చు చేయాల్సి వస్తుంది. గడ్డి ధర తక్కువగా ఉన్నా సేకరించేందుకు కూలీలు, రవాణా ఖర్చులతో పాటు కల్లాంలో నిల్వ ఉంచుకొనేందుకు అయ్యే ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. అంత మొత్తం చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఏది ఏమైనా పశుపోషణ భారంగా మారింది.
– గిరి, పశుపోషకుడు, శ్రీనివాసపురం, గోస్పాడు

సారా విక్రేతల అరెస్ట్

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మంచికంటి దినేష్, కందూరి రాఘవేంద్ర శిరివెళ్ల మెట్ట వద్ద ఉన్న హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద 20 లీటర్ల నాటు సారా అమ్ముతుండగా దాడి చేసి అదుపులోకి తీసుకొని ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

నంద్యాల(సిటీ): పట్టణంలోని 27, 13వ వార్డు సచివాలయాలను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రికార్డులు, మూవ్‌మెంట్ రిజిస్టర్‌లను పరిశీలించి, సిబ్బంది సమయపాలన తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రతి ఒక్కరూ సాధించి, పథకాలను అర్హులైన వారందరికీ అందించాలన్నారు. అదేవిధంగా 0 -5, 6-19 సంవత్సరాల లోపు చిన్నారులపై సర్వే చేసి వారి ఆధార్‌ను అప్‌డేట్ చేయించాలని చెప్పారు.

4నుంచి ఆధార్ శిబిరాలు

ఉయ్యాలవాడ : 0 – 5 సంవత్సరాల్లోపు చిన్నారుల కోసం మండలంలో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 4వ తేదీ ఇంజేడు సచివాలయం, 5 సుద్దమల్ల, 6 బోడెమ్మనూరు, 8 పెద్దయమ్మనూరు, 9 కొండుపల్లె, 11 అల్లూరు, 12 హరివరం, 15 మాయలూరు, 17 తుడుమలదిన్నె, 18 ఆర్.జంబులదిన్నె సచివాలయాల్లో క్యాంపులను ఏర్పాటు చేస్తామన్నారు. నిర్ణీత తేదీల్లో ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వర్వస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తామని ఉత్సవ ఆహ్వాన కమిటీ, గ్రామస్తులు మంగళవారం తెలిపారు. 5న గంగాయానం, గోపూజ, గణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవాచనం, నాంది, మాతృకాపూజ తదితర పూజలతో పాటు గ్రామోత్సవం, చెక్కభజన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే శ్రీజ్ఞాన ప్రసాద గురూజీ దివ్య సందేశం, బ్రహ్మశ్రీ డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు ప్రవచనములు వినిపిస్తారని చెప్పారు. 6న ప్రాతఃకాలపూజ, మహాస్నపనం, జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామితో ధ్వజ ప్రతిష్ఠ, గణపతి నవగ్రహ, రుద్ర, చండీ హోమాలు, ధాన్యాదివాసనం ఉంటాయన్నారు. రాత్రి ప్రవచనాలతో పాటు భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. 7న గర్తపూజ, యంత్రార్చన, శిఖరయంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, బింబకళాన్యాసం, కక్షాగ్ని, జ్వాలా దర్శనం, పూర్ణాహుతితో పాటు ఉదయం 9గంటలకు శివపార్వతుల కల్యాణం మహా మంగళహారతి, వేదస్వస్తి జరిపిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వెంటాడుతున్న వాన భయం



చిత్రేనిపల్లె వద్ద ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా చేస్తున్న రైతులు

రుద్రవరం: మండలంలోని రైతులను వాన భయం వెన్నాడుతోంది. రబీలో సాగు చేసిన వరి,మొక్కజొన్న పంటల కోతలు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. దిగుబడులను ఆరబెట్టుకున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న గాలివానతో ధాన్యం తడిసిపోతోంది. అలాగే కోతకు సిద్ధంగా ఉన్న పైరు నేలవాలుతోంది. మేఘావృతమైందంటే చాలు.. ఆరబోసుకున్న ధాన్యాన్ని కుప్పలుగా చేసి పట్టలు కప్పుకుంటున్నారు. అయితే కొద్దిసేపటికి చినుకులు రాలి మేఘాలు తేలిపోతున్నాయి. ఆ తరువాత మళ్లీ గింజలను ఆరబోసుకుంటున్నారు. ఇలా రోజంతా పలు మార్లు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం తగ్గాక కోతలు సాగిద్దామం టే ధాన్యం పొలంలోనే రాలుతుందనే భయం మరికొందరు రైతుల్లో నెలకొంది. చిత్రేనిపల్లె గ్రామ సమీపంలోని రైతులు వరి కోతలు సాగించి వచ్చిన ధాన్యం దిగుబడులను పొలాల్లో ఆరబెట్టారు. మంగళవారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీస్తుండటంతో వర్షం కురుస్తుందనే భయంతో ధాన్యాన్ని కుప్పలుగా చేసి తడవకుండా పట్టలు కప్పారు.

శ్మశాన వాటికలకు స్థలాలు గుర్తించండి

- రీ సర్వే ప్రక్రియను గడువులోపు పూర్తి చేయాలి
- రెవెన్యూ అంశాల్లో లక్ష్యాన్ని చేరుకోవాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలోని మండలాల్లో ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు స్థలాలను అన్వేషించి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో భూసేకరణ, పీఓఎల్‌ఆర్ రీ సర్వే, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, బనగానపల్లె తదితర మండలాల్లోని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు స్థలాలు గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. చెంచుగూడెంలలో పెండింగ్ ఉన్న రేషన్ కార్డులు, ఏఏవై, ఆధార్ కార్డులు వారంలో పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగంగా గడువులోపు పూర్తి చేయాలని, చుక్కల భూములకు సంబంధించిన భూములను సబ్ డివిజన్ చేసి సమర్పించాలని చెప్పారు. ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డీఓలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, ఎం.దాసు, తహసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో నిర్లక్ష్యం తగదు

జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మనజీర్ జిలానీ శామూన్ హౌసింగ్ ఇంజినీర్లను హెచ్చరించారు. గృహ నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌సీ స్థాయిలో ఉన్న గృహాలన్నీ ఈ నెల 15లోపు పూర్తిస్థాయిలో పూర్తి చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. 13 లేఅవుట్లలో పెండింగులో ఉన్న 1300 ఎలక్ట్రికల్ పోల్స్, విద్యుత్ వైరింగ్ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే 18 లేఅవుట్లలో అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్లు, కల్వర్ట్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని ఇంజనీర్లకు సూచించారు. 66 లేఅవుట్లకు ట్యాబ్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. మిడుతూరు, గోస్పాడు ఇతర మండలాల్లో జగనన్న కాలనీలకు భూసేకరణ చేసి గృహ నిర్మాణాలు చేపట్టక పోవడానికి గల కారణాలు విశ్లేషిస్తూ, నిధుల దుర్వినియోగాయానికి బాధ్యులెవరని, తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. హౌసింగ్ పీడీ రామశేషు, ఈఈ మాధవరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



బీరువా అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(అర్బన్): జమియత్ ఉలామా హింద్ సంస్థ అధ్యక్షుడు మౌలానా ఖలీల్ అహమ్మద్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన 10మంది నిరుపేద కుటుంబాల పెళ్లికి అవసరమైన బీరువా, ఖురాన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్యే ఇసాక్‌బాషా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, డాక్టర్లు శ్రీనివాసరావు, మహబూబ్ బాషా, సుధాకర్, శ్యాంసుందర్‌లాల్, మహమ్మద్ రఫీ, గన్నీకరీం పాల్గొన్నారు.

ఔను.. ఎన్నడూ లేని సంక్షేమాన్ని పొందుతున్నాం

- ఎమ్మెల్యే గంగులతో లబ్ధిదారుల సంతోషం
- దొర్నిపాడులో కొనసాగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం'



పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: ఎన్ని ప్రభుత్వ వచ్చినా ప్రస్తుతం అందుతున్నన్ని సంక్షేమ పథకాలు అందలేదు.. ఇంత పెద్ద మొత్తంలో తాము లబ్ధి అందుకోలేదని దొర్నిపాడువాసులు తెలియజేశారు. మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నాలుగో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామంలో పర్యటిస్తుండగా ఎమ్మెల్యే మాట్లాడకముందే స్థానికులు స్వతాహాగా ముందుకొచ్చి తాము ఎన్ని పథకాలు అందుకుంటున్నాము.. ఎంత మొత్తం లబ్ధి పొందామనేది వివరించారు. గతంలో గతంలో పింఛన్ సొమ్ము చేతికి రావాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని, వారు పిలిచిన చోటుకు ఖర్చు చేసుకొని వెళ్లినా అడియాశలు తప్పేవి కాదని గుర్తు చేశారు. కానీ నేడు జగనన్న మాత్రం ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారు జామునే తమ ఇంటికొచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల విత్తనాలు, ఎరువులు తమ గ్రామంలోనే పొందుతున్నామని, దీంతో విత్తనాలకు అగచాట్లు తప్పాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కాలనీలో పంటకాల్వ, ఇళ్లకు వెళ్లే రహదారి రెండు కలిసి పోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయని స్థానికులు ప్రస్తావించగా వెంటనే కల్వర్టు వేయించాలని పీఆర్ ఏఈ కొండారెడ్డి ఆదేశించారు. పట్టాల్సిన లబ్ధిదారులందరికీ స్థలాలు చూపాలని వీఆర్‌ఓ నాగేష్‌కు సూచించారు. కాలనీలోని తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచ్ దేవమణి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, నాయకులు కాకనూరు మనోహర్‌రెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, పయిడేలా శివరామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి భూమా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, , మోహన్‌నాయుడు, బత్తుల రాజు, ఉప సర్పంచ్ లక్ష్మిరెడ్డి, నడిపెన్న, బత్తుల కృష్ణయ్య యాదవ్, పాదం శీను, పీఎంసీ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీడీఓ నాగ అనసూయ, తహసీల్దార్ జయప్రసాద్, ఎంఈఓ కరీం, పీఆర్ డీఈ లక్ష్మీనరసింహులు, డాక్టర్ రుహుల్లాఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, వర్క్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మం పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- పెద్దకొట్టాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): పథకాల అమలు తీరు, సమస్యలు, పాలనతీరును తెలుసుకునేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దేశంలో ఇలా ఏ రాష్ట్రంలోనూ పాలన తీరుపై పర్యటించిన సందర్భం లేదని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.15 లక్షలతో నాడు-నేడు కింద నిర్మించిన పాఠశాల, రూ.7 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలు తెలుసుకొని అక్కడే ఉన్న అధికారులకు పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో లంచాలు ఇచ్చినప్పటికీ అర్హులైన చాలా మందికి పథకాలు అందేవి కాదన్నారు. జగనన్న పాలనలో పారదర్శకంగా అర్హులకు ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్దంశివారం, నాయకులు శీలం శివనాగిరెడ్డి, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, సర్పంచ్ వెంకటరాముడు, రవి, రవికుమార్‌రెడ్డి, బాలశివారెడ్డి, జగదీశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాయలూరులో వృద్ధురాలి నుంచి బయోమెట్రిక్ వేయిస్తున్న ఈఓపీఆర్‌డీ, కార్యదర్శి



కొండుపల్లెలో వెంకటసుబ్బమ్మకు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేశ్వరి

ఊరూరా పింఛన్ల పండుగ

ఉయ్యాలవాడ : మండలంలో పింఛన్ల పంపిణీ మంగళవారం పండుగలా సాగింది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు. కొండుపల్లె గ్రామంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 3,779 పింఛన్లకు గాను 3,538 మందికి రూ. 96,98,000 పంపిణీ చేసినట్లు కార్యాలయ పరిపాలన అధికారి సత్యన్న తెలిపారు. 93 శాతం పంపిణీ చేయగా రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తామని వెల్లడించారు.

ఉర్దూ భాష అభివృద్ధి అందరి బాధ్యత

నంద్యాల(వ్యవసాయం): ఉర్దూ బాషాభివృద్ధి మనందరి బాధ్యత అని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. నంద్యాల జమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హబీబ్ బాసా సాహెబ్ మసీదు ఆవరణలో నిర్వహించిన ఈద్ మిలాప్ ముషాయిరేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూను రెండవ అధికార భాషగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ డాక్టర్ నౌమాన్, ఫౌండేషన్ అధ్యక్షుడు సయ్యద్ జమీల్‌బాషా, నవభారత్ హుసేన్, సయ్యద్ హమీదుల్లా, కౌన్సిలర్లు తమీమ్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలాముల్లా, అతావుల్లాఖాన్, అబ్దుల్లా, ఫైజుల్లా, కవులు అంజాద్‌సాహెబ్, మగ్బూల్ జుబేర్, రూటా పాల్గొన్నారు.

అలరించిన కార్వాన్-యే ఉర్దూ ఈద్‌మిలాప్ ముషాయిరా..

నంద్యాల కార్వాన్-యే ఉర్దూ ఆధ్వర్యంలో షేక్ అబ్దుల్ సమ్మద్ అధ్యక్షతన ఉర్దూ భవనంలో నిర్వహించిన ఈద్ మిలాప్ ముషాయిరా (కవి సమ్మేళనం) అలరించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఎస్ఎండీ నౌమాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా హాజరై మాట్లాడారు. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్, కవులు పక్కీర్ అహమ్మద్, అజీద్ తగ్లీమ్, అంజాద్‌కౌషర్,ఖతీబ్ పాల్గొన్నారు.